క్లుప్తంగా

ముసురుతో ఇక్కట్లు

బి.కొత్తకోట : మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి వాతావరణం పూర్తిగా ముసురు పట్టింది. మంచు కప్పేయడంతో రహదారుల్లో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేదాక కనిపించకపోతుండటంతో వాహనాల్లో వెళ్తున్న వారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనకు గురవుతున్నారు. దీనికితోడు జల్లులతో కూడిన వర్షం కురుస్తుండటంతో బి.కొత్తకోట పట్టణంలో జనజీవనం స్తంభించింది. జన సంచారంపై ప్రభావం చూపింది. ఉదయం నుంచి దట్టమైన మంచు కప్పేసింది.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన కె.వి.రమణ తన స్వగ్రామమైన కురబలకోట మండలం వనంరెడ్డిగారిపల్లె పంచాయతీ గొడసానిపల్లెలో వ్యవసాయం చేస్తున్నాడు. మంగళవారం వ్యవసాయ పనుల నిమిత్తం గొడసానివారిపల్లె నుంచి తిరిగి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలోని తానామిట్ట వద్ద ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొనడంతో కె.వి.రమణ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జూదరులు అరెస్టు

మదనపల్లె : ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మంగళవారం కొత్తపల్లి పంచాయతీ బండకాడపల్లె వద్ద జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్.ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి దాడి చేశారన్నారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న 8 మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రభుత్వ వైద్యుల డిప్యూటేషన్లు రద్దు

మదనపల్లె : మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆస్పత్రిలో పని చేస్తున్న వైద్యుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తిరిగి యథాస్థానాల్లో విధులకు హాజరుకావాలని ఆదేశించారు. స్థానిక ఆస్పత్రిలోని అయిదుగురు వైద్యులు డిప్యూటేషన్లపై పని చేస్తుండగా మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాలతో రిలీవ్ అయ్యారు. ఆర్ఎంఓ ప్రసాదరాజు సోమల సీహెచ్‌సి, ఆర్థోవైద్యులు జ్ఞానేశ్వర్ వాల్మీకిపురం సీహెచ్‌సి, గైనకాలజిస్టు పద్మాంజలిదేవి పుంగనూరు వైద్యశాలకు, అఫ్సానాబేగం ప్రకాశం జిల్లా ఊలపాడు వైద్యశాలకు, డింపుల్ గ్రేస్ కాకినాడ వైద్యశాలకు తిరిగి వెళ్లారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం

మదనపల్లె : కర్నూలులో రాష్ట్ర హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంపై మంగళవారం న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు దక్కాల్సిన హైకోర్టు బెంచ్ ఏర్పాటుకై ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం. 151 పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ న్యాయవిభాగం అధ్యక్షులు గణపతి, న్యాయవాదులు మహమ్మద్ అయూబ్, గోపాలకృష్ణ, రఫీ, సంపత్, నాగరాజ పాల్గొన్నారు.

అపార్ అప్‌డేట్ త్వరగా పూర్తి చేయాలి

తంబళ్లపల్లె : విద్యార్థుల అపార్ అప్‌డేట్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ త్యాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో భోజన వసతి తదితర అంశాలపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అభ్యాసన స్థాయిలను పరిశీలించారు. ఆయన వెంట టీచర్లు వెంకటనారాయణ, జనార్దన్, సీఆర్‌పీ సుధాకర్ తదితరులు ఉన్నారు.

నిమ్మనపల్లె : మండలంలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి అపార్ ఐడీ జనరేట్ చేయడంలో వేగవంతమైన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి అన్నారు.

మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో విద్యార్థులకు అపార్ ఐడీ ఉపయోగాలను తెలియజేస్తూ దాని ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా అపార్‌ఐడీ తప్పులు లేకుండా చేసుకోవాలని సూచించారు. బర్త్ సర్టిఫికెట్ దరఖాస్తు చేసినవారికి సంబంధిత పంచాయతీ కార్యదర్శులు సకాలంలో ధృవపత్రాలు అందజేయాలన్నారు. ఎంఈఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సిద్దవటం : రైతులు వరిలో సస్యరక్షణ చర్యలు సకాలంలో చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి (ఏఓ) కె.రమేష్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలి రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఉదయం క్షేత్ర సందర్శన, తదిపరి గ్రామ సభ నిర్వహించామన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాల గురించి ప్రతి రైతుకు వివరించాలని వ్యవసాయ సహాయకులకు సూచించామన్నారు.

అధికారులు లేక.. అభివృద్ధి డీలా!

- ఖాళీగా దర్శనమిస్తున్న ఆర్ అండ్ బి, ఇరిగేషన్ కార్యాలయాలు
- ఒక ఈఈ, ఇద్దరు డీఈఈ, 13 ఏఈఈ పోస్టులు భర్తీ చేయని ప్రభుత్వం
- ఇరిగేషన్ ఈఈని బదిలీచేసి ఆ స్థానంలో తంబళ్లపల్లె డీఈఈకి బాధ్యతలు
- ప్రశ్నార్థకంగా రెండు శాఖల ప్రగతి


మదనపల్లె ఇరిగేషన్ ఈఈ కార్యాలయం

బి.కొత్తకోట : కీలకమైన రహదారి, భవనాలశాఖ, నీటి పారుదల, మైనర్ ఇరిగేషన్ శాఖలకు చెందిన సబ్ డివిజన్, మండలస్థాయి ఏఈ పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపనుంది. మదనపల్లె ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాల పరిధిలోని మండలాలు, సబ్ డివిజన్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయలేదు. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలు పరిధిలోకి వచ్చే ఈ కార్యాలయాల్లో అత్యధికంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఖాళీ పోస్టుల సంఖ్య ఎక్కువగా ఉన్నాయి.

ఆర్అండ్‌బీలో..

రహదారి, భవనాలశాఖ మదనపల్లె ఈఈగా అరవిందాదేవి ఎన్నికలకు ముందు ఇక్కడ పనిచేస్తూ బదిలీ అయ్యారు. ఎన్నికల తర్వాత తిరిగి మదనపల్లె ఈఈగా బాధ్యతలను స్వీకరించారు. తంబళ్లపల్లె, మదనపల్లెకు కలిపి ఒక సబ్‌డివిజన్ ఉండగా దీనికి ఒక డీఈఈ ఉండాలి. ఈ పోస్టును భర్తీ చేయగా పీలేరు సబ్‌డివిజన్ డీఈఈ పోస్టు భర్తీ చేయకపోవడంతో ఖాళీగా ఉంది. ఈ మూడు నియోజకవర్గాలకు చెందిన అన్ని మండలాలను కలిపి ఏడు ఏఈఈ పోస్టులు ఉన్నాయి. వీటిలో మదనపల్లె ఏఈఈ పోస్టు మినహా మిగిలిన ఆరు ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బదిలీల ప్రక్రియ పూర్తయినా వీటిని భర్తీ చేయలేదు. అంటే ఈ శాఖకు సంబంధించి ఒక డీఈఈ, ఆరు ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఏడుగురు ఏఈఈలు చేయాల్సిన పనులను ఒక ఏఈఈ చేయాల్సి వస్తుంది.

ఇరిగేషన్‌లోనూ అంతే

మదనపల్లె ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిధిలో పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో వాయల్పాడు సబ్‌డివిజన్ డీఈఈ పోస్టు భర్తీ కాలేదు. పులిచర్ల ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం ఏఈ పోస్టు భర్తీ నోచుకోలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి డీఈఈ పోస్టును మాత్రమే భర్తీ చేశారు. గతంలో ఇక్కడ డీఈఈగా పనిచేసిన సురేష్ బాబు మళ్లీ నియమితులయ్యారు. అయితే పెద్దేరు ప్రాజెక్టు ఏఈ, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, కురబలకోట మండలాలకు ఏఈఈలను నియమించకుండా ఖాళీగా ఉంచేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఐదు ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా మదనపల్లె ఈఈగా పనిచేస్తున్న సురేంద్రారెడ్డిని బదిలీ చేయగా ఆ స్థానంలో ఈఈని నియమించలేదు. తంబళ్లపల్లె డీఈఈ సురేష్ బాబుకు ఈఈ బాధ్యతలను అప్పగించగా సోమవారం స్వీకరించారు.

ఏ పనులు చేస్తారో

ప్రభుత్వం రహదారుల పనులను ప్రాధాన్యతగా చేపట్టింది. మూడు నియోజకవర్గాల్లో ఈ పనులు చేపట్టడం, పర్యవేక్షణ ఎలా చేయిస్తుందో ప్రభుత్వానికే తెలియాలి. కేవలం ఒకే ఏఈఈతో మూడు నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పనులు ఎవరు.. ఎలా పరిశీలిస్తారు, ప్రతిపాదనలు, వాటి మంజూరుకు సంబంధించిన పనులను ఎలా చేయిస్తారు అన్నది అర్థంకాని పరిస్థితి. ఒక ఈఈ, ఒక డీఈఈ, ఒక ఏఈఈతో వేల కిలోమీటర్ల రహదారుల నిర్వహణ ఎలా సాధ్యమో ప్రభుత్వమే తేల్చాలి. ఇక మైనర్ ఇరిగేషన్ పనులు ముఖ్యమైనవే. త్వరలో జరగనున్న నీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణ, వాటి పర్యవేక్షణ వ్యవహారాలపై ఎవరికి బాధ్యతలు అప్పగిస్తారు, వారెలా చూస్తారన్నది ప్రశ్నార్థకం.

సౌత్ ఇండియా పోటీలకు జ్ఞానాంబిక విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కాలేజీ కరస్పాండెంట్ గురుప్రసాద్ తదితరులు

మదనపల్లె సిటీ : సౌత్ ఇండియా స్థాయిలో చెన్నైలో ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో నిర్వహించనున్న యువతరం ఫెస్టివల్ పోటీలకు జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఎంపికైనట్లు కాలేజీ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం కాలేజీలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ యువతరం ఫెస్టివల్‌లో భాగంగా జానపదనృత్యం విభాగంలో కాలేజీ విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈనెల 10వ తేదీన ఎస్వీ యూనివర్శిటీలో నిర్వహించిన అంతర్ యూనివర్శిటీలో నిర్వహించిన యువ తరంగ ఫెస్టివల్‌లో తమ కాలేజీ విద్యార్థులు జానపద నృత్య పోటీల్లో లంబాడా నృత్యం ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించారన్నారు. ఈ నృత్య బృందం ఈనెల 26 నుంచి 30 వతేదీ వరకు చెన్నైలో నిర్వహించనున్న సౌత్ ఇండియా స్థాయి యువతరం పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం కాలేజీలో అభినందించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల్లో నిలువు దోపిడీ?

పెద్దతిప్పసముద్రం : జనన ధృవీకరణ పత్రాల ఆధారంగా ఆధార్ కార్డులో వివరాలు సవరించేందుకు సచివాలయ సిబ్బంది కొందరు నిలువు దోపిడీ చేస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ, ఇంటిపేరుకు ఇలా సవరణ చేసే ప్రతిసారి సిబ్బంది ఒక్కొక్కరి నుంచి రూ.200ల నుంచి రూ.500ల వరకు అక్రమంగా వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారని విద్యార్థుల కన్నవాళ్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెండు ఆధార్ కేంద్రాలు ఉన్నా.. సచివాలయాల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నా.. పట్టించుకునే నాథుడు కరువయ్యారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారు అడిగిన డబ్బులు ఇవ్వకపోతే రేపు, ఎల్లుండి రాపోండి అంటూ కాలయాపన చేస్తూ వారిని నిత్యం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్నారని ప్రజల్లో ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. విద్యార్థులకు జనన ధృవపత్రాలు, ఆధార్ అప్‌డేట్ ఉచితమని చెప్పే అధికారులు ప్రభుత్వ హైస్కూళ్లలో నామమాత్రంగా రెండు రోజులు క్యాంపులు నిర్వహించి చేతులు దులుపుకుని అనంతరం సచివాలయాల్లో ప్రజల నుంచి డబ్బులు ముక్కుపిండి వసూలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా మరి కొంత మంది ప్రైవేటు వ్యక్తులు జనన ధృవపత్రానికి అఫిడవిట్ అవసరం లేకున్నా వారి నుంచి రూ.350ల నుంచి రూ.500ల వరకు డిమాండ్ చేసి జేబులు నింపుకుంటున్నారని ప్రజలు తెలియజేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌ను మంగళవారం వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని సచివాలయ సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తనతో నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

శివయ్య ప్రసాదం.. మూగజీవులకు ఆహారం


రాపూరు ఘాట్‌లో వానరాలకు పండ్లను అందిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : కార్తిక మాసం చివరి సోమవారం ఒక్క రాజంపేట పట్టణంలోని శివాలయంలోనే పెద్ద సంఖ్యలో పండ్లను భక్తులు స్వామివారికి ప్రసాదంగా పెట్టారు. పండ్లు నిరుపయోగం కాకూడదని పట్టణంలోని ఈడిగపాళెంకు చెందిన నరసింహ అనే ఎలక్ట్రీషియన్‌తో పాటు చిరువ్యాపారులైన నరసింహులు, సురేంద్ర, రమణ, నరసయ్య, హరి, సుబ్రమణ్యం, షఫీ భావించారు. శివాలయంలో భక్తులు ఉంచిన పండ్లను సేకరించి గోతాల్లో చేర్చి మంగళవారం ప్రత్యేక వాహనంలో రాపూరు ఘాట్‌లోని అటవీ ప్రాంతానికి వాటిని తీసుకెళ్లారు. అక్కడ దారి వెంబడి ఉండే వానరాలకు అరటి, చీనీ పండ్లను ఆహారంగా పెట్టారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పీలేరురూరల్ : అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చల్లటి వాతావరణంలో ప్రజలకు జలుబు, దగ్గు, గొంతునొప్పి, జ్వరం, ఆయాసం, అలర్జీ, నిమోనియా, తదితర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

29న జాబ్ మేళా

మదనపల్లె సిటీ : స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. టాటావిస్‌సన్, టాటా క్యాపిటల్, ఎస్‌బీఐ లైఫ్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్,డిగ్రీ చదివిన విద్యార్థులు హాజరు కావచ్చునన్నారు. వివరాలకు 9553202509, 63062761 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కమనీయం.. సాములోరి కల్యాణం


కల్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్న పురోహితులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని గాంధీసర్కిల్‌లో మంగళవారం రాత్రి శ్రీ దేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ప్రముఖ పురోహితులు శశిధర్ స్వామి నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. అనంతరం పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను జరిపించారు. అంతకుముందు ఎదుర్కోళ్లను నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంచి పెట్టడంతోపాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

మంచు దుప్పటిలో హార్సిలీ హిల్స్

కమ్ముకున్న మేఘాలు, దట్టమైన మంచు, ఆపై చిరుజల్లులతో పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మనసు దోచే ప్రకృతి అందాలు ఆహ్లాదపరుస్తుండగా సందర్శకులు ఉత్సాహంగా సందడి చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి కొండపై వాతావరణం మారిపోయింది. కార్లలో వచ్చిన పర్యాటకులకు రహదారి కనిపించక లైట్ల వెలుగులో కొండపైకి చేరుకుంటున్నారు. గాలిబండ, వ్యూ పాయింట్లు, పర్యావరణ సముదాయం, గవర్నర్ బంగ్లా, రోడ్లన్నింటిని దట్టమైన మేఘాలు కమ్మేయడంతో ఈ ఆహ్లాద వాతావరణం తిలకించేందుకు ప్రకృతి ప్రియులు కొండకు పరుగులు తీస్తున్నారు.

– బి.కొత్తకోట


మంచులో సంచరిస్తున్న సందర్శకులు


టురిజం రెస్టారెంట్‌ను కప్పేసిన మంచు, మేఘాలు


హార్సిలీహిల్స్ ముఖద్వారం వద్ద దట్టమైన మేఘాలు

భారత రాజ్యాంగం ఉన్నతమైనది

పెద్దతిప్పసముద్రం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత నాయకుడు మాత్రమే కాదని ఆయన జాతి సంపద అని బాస్ నాయకుడు జిల్లా ఎన్‌హెచ్‌ఏపీ సభ్యులు కేవీ రమణ కొనియాడారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మహమూద్‌తోపాటు కూటమి, దళిత నాయకులు సంపతికోట కిట్టన్న, సూరి, రామచంద్ర, గంగన్న, లక్ష్మీనారాయణ, రామప్ప, నరసింహులు, టైలర్ రమణ, నరసింహులు, నాగరాజు పాల్గొన్నారు.

అందరికీ రాజ్యాంగం రక్ష

బి.కొత్తకోట : దేశంలో ప్రతిఒక్కరికి రాజ్యాంగం రక్షణగా నిలుస్తుందని నగర పంచాయతీ కమిషనర్ పల్లవి, ఎంఈఓ రెడ్డిశేఖర్ అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమిషనర్‌తో కలిసి బాస్ నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక భారత్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు జాతీయ నేతలు, ప్రముఖుల వేషధారణలో ప్రదర్శన నిర్వహించారు.

ఈ కార్యక్రమాలకు హాజరైన వారు మాట్లాడుతూ రాజ్యాంగం అందరికి ఒకటేనని, వివక్షలేనిదని అన్నారు. అందరికి సమాన హక్కులు, బాధ్యతలను రాజ్యాంగం కల్పిస్తోందని, మహోన్నతమైన మన రాజ్యాంగం మరో దేశంలో లేదన్నారు. కార్యక్రమాల్లో మేనేజర్ రమాదేవి, పూజారి శ్రీనివాసులు, బాస్ నాయకులు సింగన్న, సచిన్, వెంకటేష్, మాజీ ఉప సర్పంచు పాగొండ సమీవుల్లా, రాధాకృష్ణ, ఇమాం సాబ్, మహేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి

పెద్దమండ్యం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు మంగళవారం అధికారులు ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అందరికీ రక్షణ ఉందని అన్నారు. స్నేహపూర్వకమైన వాతావరణంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రజలందరికి సమాన హక్కులను కల్పించినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ మురళి, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు వేమల బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


పెద్దమండ్యం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

మదనపల్లె సిటీ : రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మంగళవారం పలు పాఠశాలలు, కాలేజీల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మాయబజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్, రాజగోపాల్ హాజరయ్యారు. డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం పురం వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, న్యాయవాది బాలజ్యోతి మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం మహోన్నత పత్రం

మదనపల్లె సిటీ : దేశవాసులు స్వయంగా తయారు చేసుకున్న ఓ మహోన్నత పత్రం భారత రాజ్యాంగమని పలువురు వక్తలు కీర్తించారు. మంగళవారం స్థానిక కదిరిరోడ్డులోని శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. అంబేడ్కర్ చిత్రపటానికి పూలు సమర్పించి గౌరవ వందనం చేశారు. రాజ్యాంగ ప్రవేశికను చదివి, అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఎస్వీ యూనివర్శిటీ మాజీ సెనేట్ సభ్యులు రాటకొండ గురుప్రసాద్ , బాస్ వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాకవి పోతబోలు రెడ్డప్ప, ఎస్ఎస్ఎస్ అధికారి రెడ్డప్పరెడ్డి, మార్పురి శశిధర్‌రావు, రామమూర్తి, కంభం నాగభూషణరెడ్డి, ముత్యాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దతిప్పసముద్రంలో..

భారత రాజ్యంగం మహోన్నతమైనది

కేవీపల్లె : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం మహోన్నతమైనదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.ఎల్. వెంకటేష్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా మన రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

నిమ్మనపల్లె : మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డీఎల్‌డీఓ లక్ష్మిపతి ముష్టూరు కస్తూరిబా పాఠశాలలో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. తహశీల్దార్ ధనుంజయులు రెవిన్యూ కార్యాలయంలో వేడుకలు నిర్వహించి బస్టాండు కేంద్రంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి, మండల వనరుల కేంద్రంలో ఎంఈఓలు ఎంఆర్ పద్మావతి, నారాయణ, జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం అంజాద్‌అలీఖాన్ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


బి.కొత్తకోట: దేశ నాయకుల వేషధారణలో విద్యార్థులు

భారత రాజ్యాంగం ప్రపంచానికే దిక్సూచి

కలకడ : ప్రపంచ దేశాలకే దిక్సూచిగా భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.జె.భారతి అన్నారు. మంగళవారం రాజ్యాంగదినోత్సవాన్ని పురష్కరించుకుని రాజ్యాంగ పీఠిక ప్రాముఖ్యతను తెలియజేశారు. రాజ్యంగ పీఠికపై అవగాహన ర్యాలీ నిర్వహించి, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రమణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాంఆఫీసర్ పుష్పకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న ప్రిన్సిపాల్ కె.జె.భారతి, తదితరులు

భారత రాజ్యాంగం ఆదర్శనీయం

మదనపల్లె : ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలకు భారత రాజ్యాంగం ఆదర్శనీయమని హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర అన్నారు. మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజల గుండెచప్పుడు రాజ్యాంగమన్నారు. దేశ అభివృద్ధికి రాజ్యాంగం బాటలు వేసిందన్నారు. కొండామారిపల్లె గ్రామ సచివాలయంలో డీఎల్‌డీఓ లక్ష్మిపతి రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఏడీఏ శివశంకర్, మండల వ్యవసాయశాఖ అధికారి నాగప్రసాద్ తదితరులు రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


మదనపల్లె సిటీ: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థులు


భారతరాజ్యాంగాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రజాహిత గ్రంథం భారత రాజ్యాంగం

పీలేరు : ప్రజాహిత గ్రంథం భారత రాజ్యాంగమని వక్తలు అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పంచాయతీ కార్యాలయంలో, డిగ్రీ కళాశాలలో, ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి, అంబేడ్కర్ సర్కిల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఈవో గురుమోహన్, ఎస్‌జీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎమ్మార్పీఎస్ గండికోట వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.